క్లుప్తంగా

సచివాలయ సిబ్బందికి సన్మానం



ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

జి.సిగడాం : విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని మెట్టవలస పంచాయతీ సర్పంచ్ కామొజుల ఆరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర విజయలక్ష్మి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ధర్మవరపు సతీష్, సత్యనారాయణ, రవీంద్ర, ఇందుమతి, అబి బుల్లాబేగ్, ఈశ్వరరావు, సత్యవతి, శ్రావణ భార్గవి, నాగమణిలకు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గొబ్బూరు సర్పంచ్ మహాదాస్యం చిన్నారావు, పైల వాసు, బెవర బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు బొంతు రమణ, రౌతు చైతన్యకుమారి, వావిలపల్లి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ టీచర్‌కు సత్కారం



మూర్తిని సన్మానిస్తున్న గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: నైరా ప్రాథమిక పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలుగా సేవలందించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు పి.వి.ఎస్.ఎన్.మూర్తికి గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి మూర్తి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఎంఈఓ ఎస్.కృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, జిల్లా రాష్ట్రస్థాయిలో రిసోర్స్‌పర్సన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.కృష్ణమోహన్, తిరుపతిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులను రోడ్డుపైకి వదిలితే చర్యలు



పశువుల్ని వాహనాల్లోకి ఎక్కిస్తున్న మున్సిపల్ అధికారులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలో పశువులను విచ్చలవిడిగా వదిలితే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌కుమార్ హెచ్చరించారు. గత నెల 29న 'నగరం..నరకం' అనే శీర్షికన పశువుల సంచారంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. కమిషనర్ ఆదేశాల మేరకు పలు ప్రధాన కూడళ్లు, రోడ్లపై విచ్చలవిడిగా తిరిగే పశువులను పట్టుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆర్.కె.నగర్‌లో పశువుల సంరక్షణ కేంద్రానికి మంగళవారం తరలించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ పశువుల యజమానులు విచ్చలవిడిగా పశువులను రోడ్లపై విడిచిపెట్టడం ద్వారా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. ఇకపై మునిసిపల్ యాక్ట్ ప్రకారం యజమానికి సైతం జరిమానా విధిస్తామన్నారు. భవిష్యత్తులో కేసులు కూడా పెడతామని హెచ్చరించారు.

విద్యార్థులకు పద్యాల పుస్తకాలు పంపిణీ



పద్య పుస్తకాలతో విద్యార్థినులు

జి.సిగడాం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో చదువుతున్న బాలికలకు ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల మంగళవారం పద్యాల పోటీలు నిర్వహించారు. నందూరి గోవిందరావు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు.

తల్లిపాలే శ్రేయస్కరం



తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: అమ్మపాలు బిడ్డకు రక్ష, తల్లికి శ్రీరామరక్ష అని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి.సింధూర అన్నారు. శ్రీకాకుళంలోని సింధూర హాస్పిటల్ ఆవరణలో మంగళవారం క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మాలతి, క్లబ్ ప్రతినిధులు పొన్నాడ రవికుమార్, నటుకుల మోహన్, టిక్కం రాంగోపాల్, బి.దేవభూషణం, బోగెల ఉమామహేశ్వరరావు, సభ్యులు బి.మాధురి, అడపా శాంతి, ఎన్.రమ్య, బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంది అందేనా?



- రేషన్ డిపోల్లో దొరకని కందిపప్పు
- గార మండలంలో సరఫరా కాని వైనం
- మిగిలిన ప్రాంతాల్లో కొన్ని డిపోల్లోనే పంపిణీ

గార : కూటమి ప్రభుత్వంలో పేదోడికి పప్పన్నం కరువైంది. తాము అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలకు పేదలకు కిలో కందిపప్పు కూడా రేషన్ దుకాణాలు ద్వారా అందించలేకపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఇంటి వద్దకే రేషన్ రద్దు చేసిన సర్కారు.. జనాలను డిపోల వద్ద క్యూకట్టి నిరీక్షించాల్సిన దుస్థితికి తీసుకొచ్చింది.

అంతా ఆర్భాటమే..

రేషన్ డిపోల్లో అన్ని నిత్యావసర సరుకులు తక్కువ ధరలకు దొరికేలా మాల్స్‌లా తీర్చిదిద్దుతామని ఎన్నికల ముందు ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారు. క్షేత్రస్థాయిలో పేద, మధ్య తరగతి ప్రజలకు అవసరమైన కందిపప్పు సరఫరా చేయలేకపోతున్నారు. ఒక వైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. గత ప్రభుత్వంలో బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండి పంపిణీ చేసేవారు. కిలో కందిపప్పు రూ. 67 లకే ఇచ్చేవారు. ప్రస్తుతం రేషన్ డిపోల ద్వారా కందిపప్పు ఎప్పటి నుంచి ఇస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

14 నెలలుగా ఎదురు చూపులే..

గార మండలంలో 25,123 రేషన్ కార్డుదారులున్నారు. వీరంతా ప్రతి నెలా రేషన్ డిపోలో ఇచ్చే కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా కార్డుదారులు కంది పప్పు వచ్చిందా.. ఎప్పుడొస్తుంది.. అసలు ఇస్తారా లేదా అని ప్రశ్నలు అడుగుతుంటే రేషన్ డీలర్లు తెల్ల మొహం వేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కంది పప్పు రూ.140 నుంచి రూ.160 వరకు ధర పలుకుతోంది. అంత ధర పెట్టి కొనలేని పేద, మధ్య తరగతి ప్రజలు రేషన్ షాపులో ఎప్పుడు ఇస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నెల కాకపోతే వచ్చే నెల అయినా ఇస్తారని ఆశపడుతూ వస్తున్న మహిళలకు 14 నెలలుగా ఎదురు చూపులే మిగులుతున్నాయి.



చౌకధరల దుకాణం వద్ద వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారు

లేదంటున్నారు



రేషన్ డిపోలో బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే రాలేదని డీలర్ చెబుతున్నారు. బయట మార్కెట్‌లో కిలో రూ.160 వరకు ధర ఉంటోంది. అంత ధర పెట్టి కొనలేకపోతున్నాం. గతంలో కిలో రూ.67 లకే కందిపప్పు ఇచ్చేవారు.

– ఆర్. ఝాన్సీరాణి, శ్రీకూర్మం, గార మండలం

పప్పు సరఫరా చేయాలి



ఎన్నికల ముందు అన్ని సరుకులు రేషన్ షాపుల్లో దొరికేలా చూస్తామన్నారు. ఇప్పుడేమో కందిపప్పు రాలేదని చెబుతున్నారు. పేదలకు అవసరమైన కందిపప్పు సరఫరా అయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు చేపట్టాలి.

– వమరవల్లి భారతి, మాజీ సర్పంచ్, తోనంగి

స్మార్ట్‌మీటర్లతో ప్రజలపై విద్యుత్ భారం



ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



రణస్థలం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎచ్చెర్ల : విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారాలు మోపడం సరికాదని, ట్రూ అప్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల వద్దు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఎచ్చెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా మాట్లాడిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ఆదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. టైం ఆఫ్ దిడే విధానం పేరుతో గంట గంటకు రీడింగ్ తీసే అవకాశం ఉండటంతో ఆదానీ కంపెనీ ప్రజలను దోపిడీ చేస్తోందన్నారు. ఇప్పటికే పెరిగిన బిల్లులతో సామాన్యులు గగ్గోలు పెడుతున్నారని చెప్పారు. తాజాగా మరో రూ. 12,771 కోట్లు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపడానికి ప్రతిపాదన తయారుచేసిందన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డి.బంగారాజు, టి.రామారావు, జి.శ్రీనివాసరావు, ఎల్.సీతారాం, ఎస్.కామేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, బి.రాము, సీహెచ్.తేజ, ఎస్.నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: విద్యుత్ స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, సీపీఎం రణస్థలం శాఖ కార్యదర్శి వెలమల రమణ డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా వేదిక రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా రణస్థలం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోని వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో డి.మహాలక్ష్మినాయుడు, వి.లక్ష్మి, ఎం.రాము, డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



రాధా గోవిందుల ఊంజల సేవ

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ జగన్నాథ మందిరంలో మంగళవారం రాధా గోవిందుల ఊంజల సేవ ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ ప్రతినిధి లక్ష్మీగౌర్‌దాస్ ఆధ్వర్యంలో పూజలు, హారతులు, గీతాలాపనలు జరిగాయి.

విస్తృతంగా తనిఖీలు



డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్‌ఐ రామారావు

శ్రీకాకుళం క్రైమ్ : రహదారి ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఆగస్టు నెలంతా జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ (డ్రంకెన్) డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. డీజీపీ హరీష్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. అతివేగం, హెల్మెట్ ధారణ, బ్లాక్‌స్పాట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, మైనర్ రైడింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

వినూత్న పద్ధతులతో మెరుగైన ఫలితాలు



క్షేత్ర పరిశీలనలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల : ప్రకృతి వ్యవసాయంలో వినూత్న పద్ధతులు ఆచరించడం ద్వారా మెరుగైన ఫలితాలను పొందవచ్చని రీజనల్ ప్రకృతి వ్యవసాయం అధికారులు ప్రకాష్, హేమసుందర్ అన్నారు. జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి క్షేత్ర స్థాయి సందర్శనలో భాగంగా మంగళవారం ఎచ్చెర్ల మండలం కొత్తపేటలో వరి డ్రమ్‌సీడర్ పద్ధతిలో నవధాన్యాలను విత్తే విధానం వివరించారు. అనంతరం డీపీఎం పూజారి సత్యనారాయణ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు సక్రమంగా అందాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మానసిక, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగుల పరిస్థితిని సమీక్షించి వైద్య సేవలపై ఆరా తీశారు. పౌష్టికాహార సరఫరా, పరిశుభ్రత వంటి అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించి కేసుల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డి.వి.పద్మ, అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.



వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

బ్రహ్మకుమారీల రక్షాబంధన్



బ్రహ్మకుమారీలతో న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయవాదులు బార్ అసోసియేషన్ భవనంలో మంగళవారం బ్రహ్మకుమారీ సంస్థ నిర్వాహకులు రాఖీ పండుగ నిర్వహించారు. పలువురు న్యాయవాదులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, కార్యదర్శి పిట్టా దామోదరరావు, ఉపాధ్యక్షులు ఇప్పిలి సీతరాజు, కార్యవర్గ సభ్యులు రమణమూర్తి, హరిప్రసాద్, వనజాక్షి, సీనియర్ న్యాయవాదులు తర్లాడ రాధాకృష్ణ, పి.వి.రమణ దయాల్, మురళి మోహనరావు, పాడి సీతన్నాయుడు, వాన కృష్ణచంద్, పి.నాగేశ్వరరావు, కృష్ణాజి, జావాన శ్రీనివాసరావు, అప్పారావు పట్నాయుకుని, అబ్బాస్, తంగి వంశీకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి : అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణ సేవ మంగళవారం ఉదయం ఘనంగా జరిగింది. శ్రావణ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉషా పద్మిని ఛాయాదేవేరులతో శ్రీవారి కల్యాణ మూర్తులను ప్రత్యేక కళ్యాణ వేదికపై వేంచేసింపజేసి ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణం జరిపించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఈవో కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్ సమక్షంలో అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ కల్యాణ ప్రక్రియను పూర్తి చేశారు. రూ.500 చెల్లించిన భక్త దంపతులకు ఆలయం తరపున స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, తలంబ్రాలను అందజేశారు.



భవితకు బాసటగా..



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ, పీజీ కళాశాల

- బయెటెక్నాలజీ విద్యార్థుల కోసం ఉపాధి మార్గాలు
- పలు ఆస్పత్రులతో ఎంఓయూ కుదుర్చుకున్న శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్



ఎంఓయూ కుదుర్చుకుంటున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బయెటెక్నాలజీ, ఎమ్మెస్సీ మెడికల్ బయెటెక్నాలజీ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు ఆ కళాశాల అధికారులు బాసటగా నిలుస్తున్నారు. ఈ కోర్సుల్లో యూజీ, పీజీ పూర్తిచేసినవారికి ఉపాధి మార్గాలను అందించాలనే ఏకైక లక్ష్యంతో మొదటి విడతగా శ్రీకాకుళంలోని ప్రముఖ ఆస్పత్రులతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. నగరంలోని బగ్గు సరోజినీదేవి ఆస్పత్రి, మెడీకవర్ హాస్పటల్స్, దానేటి శ్రీధర్ హాస్పటల్స్, అరుణోదయ హాస్పటల్స్ వంటి ఆస్పత్రుల్లో మంచి ప్యాకేజీలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కళాశాల బయెటెక్నాలజీ హెచ్ఓడీ డాక్టర్ ఎం.ప్రదీప్, అధ్యాపకులు డాక్టర్ ఆర్.హరిత, పి.సుధారాణితో కలిసి వివరాలు వెల్లడించారు.

అవకాశాలు మెండు

బీఎస్సీ బయెటెక్నాలజీ, ఎమ్మెస్సీ మెడికల్ బయెటెక్నాలజీ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. ముఖ్యంగా ఎమ్మెస్సీ మెడికల్ బయెటెక్నాలజీ కోర్సు ద్వారా వైద్యరంగంలో వ్యాధులు నిర్ధారణలో, క్లీనికల్ రీసెర్చ్ విభాగంలో, బయోమెడికల్ ఇంజనీరింగ్‌లో, ఫార్మా మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల్లో వివిధ స్థాయిల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

– డాక్టర్ కె.శ్రీరాములు, ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు)

నైపుణ్యాలు తప్పనిసరి..

బీఎస్సీ బయెటెక్నాలజీ, ఎమ్మెస్సీ మెడికల్ బయెటెక్నాలజీ వంటి కోర్సుల్లో మంచి నైపుణ్యాలను అందుపుచ్చుకుంటే వైద్యరంగంలో మంచి ఎంట్రప్రెన్యూర్‌గా నిలదొక్కుకోవచ్చు. ఏపీ పీజీసెట్–2025లో అర్హత సాధించినా, సాధించకపోయినా స్పాట్ అడ్మిషన్ల కోసం కళాశాలలో బయెటెక్నాలజీ విభాగంలో వెంటనే సంప్రదించవచ్చు.

– డాక్టర్ ఎం.ప్రదీప్, కోర్సు కో–ఆర్డినేటర్, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు)

మోసం చేయడమే చంద్రబాబు నైజం



ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మోసం చేయడంలో సీఎం చంద్రబాబునాయుడుకు ఎవరూ సాటిరారని వైఎస్సార్ సీపీ మీడియా సెల్ ఇన్‌చార్జి మండవల్లి రవి పిలుపునిచ్చారు. నగర పరిధిలో మంగళవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యాలు, ఎన్నికల హామీలను ఎలా విస్మరించారో క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఏ ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చలేదన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు.. ఇలా అన్ని వర్గాలను సైతం మోసపోయారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులు రౌతు శంకరరావు, యువజన విభాగం నాయకులు నాగరాజ్, భరద్వాజ్, మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షుడు ఎంఏ బేగ్, బైరి మురళీ, కింజరాపు రమేష్, కర్నేర హరి, దుంగ సుధాకర్, పాపారావు, స్వామి, సుగుణరెడ్డి, వానపల్లి రమేష్, తోట తారక్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న విశిష్టతల సమ్మేళనం కళింగ నేల



పుస్తకావిష్కరణ చేస్తున్న రచయితలు, వర్శిటీ అధికారులు

ఎచ్చెర్ల: సంస్కృతి సంప్రదాయాలు, భౌగోళిక, సామాజిక చైతన్యాలు, భాష, యాసల్లో ఎంతో విశిష్టమైన, విభిన్నదాయకమైన చరిత్ర కలిగినది కళింగ నేల అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. నాటి అశోకుని దండయాత్ర నుంచి నేటి బీల పోరాటాల వరకూ కళింగాంధ్రులది ఆత్మాభిమాన తిరుగుబాటులేనని పేర్కొన్నారు. భారతావనికే స్ఫూర్తిదాయకమైన కళింగసీమ చరిత్ర.. పరిశోధకులు, చరిత్ర అధ్యయనకారులచే విస్మరించబడటం విచాకరమన్నారు. సిక్కోలు బుక్ పబ్లిషర్ వ్యవస్థాపకులు దుప్పల రవికుమార్ సంకలనంలో వెలువడిన 'ముంజూరు' కళింగాంధ్ర కవితా సంకలన పుస్తకావిష్కరణ సభ మంగళవారం ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ కె.ఆర్ రజనీ మాట్లాడుతూ నేటితరంలో ప్రశ్నించేతత్వం, చైతన్యం పూర్తిస్థాయిలో ఉండకపోవడంతో కళింగాంధ్ర వనరులు ఈ నేలకు చెందకుండా పోతున్నాయన్నారు. ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ కళింగాంధ్ర పోరాట పటిమి నేటికీ అనేక ఉద్యమాలు, రచనల్లో కనిపిస్తూనే ఉన్నాయన్నారు. సీనియర్ పాత్రికేయులు, రచయిత నల్లి ధర్మారావు మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఆలోచనా ధోరణితో ఈ ప్రాంతం మరింత వెనక్కి వెళ్లడం దురదృష్టకరమన్నారు. సంకలన ప్రచురణ కర్త దుప్పల రవికుమార్ మాట్లాడుతూ మరుగున పడిన కళింగాంధ్ర చరిత్ర ఈ తరానికి తెలియజేయాలని తపనలో భాగమే ఈ ప్రచురణ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, డాక్టర్ కె.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి మహా కుంభాభిషేక ఉత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో శివబాలాజీ ఆలయంలో ఈ నెల 19 నుంచి 21 వరకు ఏకోత్తర సహస్ర కలశ స్నపన పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఆలయ నిర్మాణం జరిగి 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరిగే ఈ వేడుకల్లో భక్తులంతా పాల్గొనాలని కోరారు.